క్లుప్తంగా

పెట్రోల్ బంక్ తనిఖీ



హొళగుందలో పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దారు హుసేన్‌సాహెబ్

హొళగుంద: హొళగుంద శివారు ఎల్లార్తి రోడ్డులో హనుమంత రెడ్డి పెట్రోల్ బంక్‌ను శుక్రవారం తహసీల్దారు హుసేన్‌సాహెబ్ తనిఖీ చేశారు. బంకులో పెట్రోల్ నాణ్యత, కొలతలు, అమ్మకపు ధరలు, టాయిలెట్స్ ఉన్నాయా? అని పరిశీలించి ఇతర వివరాలను తెలుసుకున్నారు. బంకుకు వచ్చిన వాహనదారులను నాణ్యత తదితర వాటి గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పెట్రోల్ అమ్మాలని నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. వాహనదారులకు కొలతలు సక్రమంగా ఉండి నాణ్యమైన పెట్రోల్, డీజిల్ విక్రయించాలని బంకు నిర్వాహకులకు సూచించారు. అలాగే మిగతా బంకులను తనిఖీ చేయనున్నట్లు తహసీల్దారు వెల్లడించారు. డీటీ ముకుందరావు వెంట ఉన్నారు.

మద్దతు ధరతో జొన్న కొనుగోళ్లు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

చిప్పగిరి: ప్రభుత్వ సూచనల మేరకు మద్దతు ధరతో రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేస్తామని ఆర్డీఓ మోహన్‌దాస్ తెలిపారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని రామదుర్గం, నగరడోణ తదితర గ్రామాల్లోని రైతులకు జొన్నల కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో పండించిన 51 రకం జొన్నలకు క్వింటాలుకు రూ.2,970 ప్రకారం ప్రభుత్వం ధర నిర్ణయించిందని తెలిపారు. ఎలాంటి తరుగు, కమీషన్ ఉండదని చెప్పారు. జొన్నలు విక్రయించాలనుకునే రైతులు స్థానిక ఆర్బీకేలో సంప్రదించాలని సూచించారు. తహసీల్దారు లక్ష్మినారాయణ, వీఆర్‌ఓ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లు భేష్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలో పన్నుల వసూళ్లలో జిల్లాలోనే ఎమ్మిగనూరు మొదటి స్థానం సాధించినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో వార్డు అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి నేటి వరకు వివిధ రూపాల్లో 71.90 శాతం పన్నుల వసూళ్లు చేసినట్లు వివరించారు. పన్నుల వసూళ్లలో చొరవ చూపిన మున్సిపల్, రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బందిని అభినందించారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.3.99 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.2.87 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. మిగతా బకాయిలను వసూలు చేయాలని సూచించారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు సరైన పోషకాహారం తీసుకొంటే రక్తహీనతను నివారించవచ్చని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, పెద్దకడుబూరు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థుల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తెలుసుకునేందుకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిమోగ్లోబిన్ శాతం పెరిగేందుకు అందుబాటులో దొరికే ఎండు ఖర్జూరం, ద్రాక్ష, వేరుశనగతో కలిపి బెల్లం, ఆకుకూరలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యులు పరిమళ, సునీత, వైద్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులు భయాన్ని వీడాలని ఏకాగ్రతతో చదివితే మెరుగైన ఫలితం సాధించవచ్చని మోటివేషనల్ స్పీకర్ సుబ్బారెడ్డి, సర్వశిక్ష ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మారుతి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటూ ఉర్దూ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించి సూచనలిచ్చారు. ఎంఈఓ ఆంజనేయులు, హెచ్ఎం గౌసియాబేగం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నపై మక్కువ

- తుంగా తీరంలో విస్తారంగా సాగు
- గతేడాది రబీలో 470 హెక్టార్లల్లో సాగు, ప్రస్తుతం 3,060 హెక్టార్లకు విస్తరణ
- ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి, ధర క్వింటాలుకు రూ.2 వేలు పైమాటే



తుంగభద్ర తీరంలో సాగైన మొక్కజొన్న

ఎమ్మిగనూరు: రైతులు సాగుచేసే ప్రధాన ధాన్యపు పంటల్లో మొక్కజొన్నది మూడో స్థానం. పోషక విలువలు అధికంగా ఉండే పంటగా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆర్బీకేల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయడం, తక్కువ పెట్టుబడి ఖర్చులు, దిగుబడులు పెరగటంతో మొక్కజొన్న సాగు యేటా విస్తరిస్తోంది. అధిక దిగుబడులు, మంచి గిట్టుబాటు ధర కారణంగా ఇటీవల కాలంలో మాగాణి భూముల్లో కూడా మొక్కజొన్న పండించేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో గతేడాది రబీలో 470 హెకార్లలో మొక్కజొన్న సాగుచేశారు. ఈ యేడాది ఏకంగా 3,060 హెక్టార్లకు పంటసాగు పెరగడం విశేషం. మొక్కజొన్న ఆహార పంటగానే కాకుండా దాణా, పశు గ్రాసం, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగా, పేలాల పంట, తీపికండి రకం, కాయగూర పంటగా పండిస్తున్నారు. వరి మాగాణుల్లో పండించే మొక్కజొన్నను ఎక్కువగా దాణా కోసం వినియోగిస్తున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

తుంగభద్ర తీరంలో విస్తారంగా సాగు

మొక్కజొన్న పంటను తుంగభద్ర నది తీరంలో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని తుంగభద్ర, రాంపురం, కగ్గల్, బసాపురం, మాధవరం, చెట్నేహళ్లి, మంత్రాలయం, నది కైరవాడి, గంగవరం, జొహరాపురం, చిన్నకొత్తిలి, ఇబ్రహీంపురం, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, గురుజాల, రాయచోటి గ్రామాల్లో రైతులు అత్యధికంగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. అదేవిధంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల పరివాహక ప్రాంతం, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలోని భూముల్లో, ఎల్లెల్సీ ఆయకట్టు భూముల్లో ఈయేడాది మొక్కజొన్న సాగు విస్తరించింది. ఆయా గ్రామాల్లో రబీ ముందస్తుగా సాగు చేసిన పంటల దిగుబడులు రాగా మిగతావన్నీ మార్చి నెలాఖరులోగా దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

గిట్టుబాటు ధరలు

పంట మార్పిడి పద్ధతిలో మొక్కజొన్న పంట సాగుచేస్తుండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి. ఎకరానికి 40–45 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.1,962. ఈయేడాది ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో క్వింటాలు రూ.2,250 వరకు అమ్ముడుపోయింది. డిమాండ్ అధికంగా ఉండటంతో వ్యాపారులే రైతుల పొలాల నుంచి ఖరీఫ్ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. రబీ ఉత్పత్తులు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడెకరాల్లో సాగు చేశా



మొక్కజొన్నకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. పెట్టుబడి ఖర్చు తక్కువ. ఎకరాకు 45 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. మూడెకరాల్లో పంట సాగు చేశా. ప్రభుత్వ ప్రోత్సాహం రైతులకు మేలు చేస్తోంది.

– రామిరెడ్డి, రైతు, జొహరాపురం

క్వింటా రూ.2,200 పలుకుతోంది



మొక్కజొన్న సాగు రైతులకు కలసొస్తుంది. ఎప్పుడూ వరి పంటలే పండించే మాగాణి భూముల్లో మొక్కజొన్న సాగు మేలు చేస్తుంది. పంట మార్పిడితో భూమిలో పోషక విలువలు పెరుగుతున్నాయి. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి ఖర్చు పెట్టుకుంటే 40 క్వింటాళ్లకు పైబడే దిగుబడి వస్తుంది. మంచి ధర వస్తే రూ.50 వేల వరకు మిగులుబాటు ఉంటుంది.

– కురువ భీరప్ప, మొక్కజొన్న రైతు

మంచి ధరలు ఉన్నాయి



మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. గత యేడాది రబీలో 470 హెక్టార్లలో సాగు చేస్తే ఈ ఏడాది ఏకంగా 3,060 హెక్టార్లలో ఈ పంట సాగైంది. మార్కెట్లో ధరలు కూడా బాగున్నాయి. ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందనే భరోసాతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు.

– మహ్మద్ ఖాద్రి, ఏడీఏ, ఎమ్మిగనూరు

భక్తులకు అన్నదానం

హొళగుంద: హొళగుంద సమీపంలోని వరబసవేశ్వర స్వామి, కోగిలతోట గ్రామంలోని గాదిలింగప్ప తాత ఆలయాల వద్ద శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాలహర్వి మండలం గూళ్యం గాధిలింగేశ్వర స్వామి జోడు రథోత్సవానికి తరలివెళ్తున్న భక్తుల కోసం ఈ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో భక్తులు జాతరకు తరలి వెళ్లారు. వారికి అన్నదాన శిబిరంలో భోజనం, తాగునీరు. సేద తీరడానికి నీడ తదితర వసతులను కల్పించారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ఓపెన్ విధానంలో ఇంటర్మీడియెట్ కోర్సు పూర్తి చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేసి ఆ నకళ్లను కళాశాలలో ఇవ్వాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లె గ్రామ సమీపంలో ఈద్గా వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కలిగిఉన్న గ్రామానికి చెందిన ఉప్పరి మనోహర్, తెలుగు కృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి 20 ఒరిజినల్ చాయిస్ విస్కీ, 90 ఎంఎల్ పరిమాణం గల 30 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

దాడులు అరికట్టాలి



పత్తికొండలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పత్తికొండటౌన్: న్యాయవాదులపై దాడులను అరికట్టాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారినేని మల్లికార్జున డిమాండ్ చేశారు. తెలంగాణా రాష్ట్రం రంగారెడ్డిలో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ జిల్లా బార్‌అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం పత్తికొండలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. స్థానిక నాలుగు స్తంభాల మండపం ఎదురుగా ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు ఎల్లారెడ్డి, ఈరన్న, నరసింహయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: తెలంగాణా రాష్ట్రంలో న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆలూరు బార్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్ అన్నారు. శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. సీనియర్ న్యాయవాదులు వాయుజీవోత్తమ రావు, సిద్దప్ప, మాధవ శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉచ్ఛాయోత్సవం



నెరణికి తండాలో రథోత్సవం జరుగుతున్న దృశ్యం

హొళగుంద: నెరణికి తండాలో శుక్రవారం మునిస్వామి, చోకాస్వామిల మేటి కుంభోత్సవం, రాత్రి ఉచ్ఛాయోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో పూజారులు స్వామి విగ్రహాలకు జలాభిషేకాలు, ఆకుపూజ, మహామంగళ హారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా మేటి కుంభోత్సవంతో పాటు పల్లకీ ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. వేడుకలో సర్పంచ్ పారుబాయి, ఎంపీటీసీ సంధ్యాబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు. శనివారం మారెమ్మ దేవర నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించండి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ టీ.నసురుద్దీన్

గోనెగండ్ల: ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని ఎంపీపీ టీ.నసురుద్దీన్ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రోజు ఎంత మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యం కోసం వేల ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లోని రోగుల ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు సకాలంలో వైద్యం అందించి మందులు పంపిణీ చేయాలన్నారు. డాక్టర్ రాఘురామి రెడ్డి, రవళి, సర్పంచ్ హైమవతి, బందెనవాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం



తొగలుగల్లులో పూజలందుకుంటున్న ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవమూర్తులు

ఆస్పరి: మండలంలోని తొగల్‌గల్ గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన ఓబులేసు స్వామి,చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిల కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఆలయంలో పూజారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవం తరువాత గ్రామంలో ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శనివారం తెల్లవారుజామున స్వామి వారి పల్లకి ఊరేగింపు, ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఆస్పరి: ఆస్పరిలో శుక్రవారం పెద్దమ్మవ్వ, దేవమ్మవ్వ విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలో భద్రకాళి, గణపతి, సంతాన నాగేంద్ర, దుర్గామాత పాద ప్రతిష్ఠతోపాటు నూతన కలశ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మఠిస్వామి శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉరుసు

కృష్ణగిరి: మండల కేంద్రంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం దస్తగిరయ్య స్వామి ఉరుసు ఈ నెల 26 నుంచి 28 వరకు ఘనంగా జరుపుకోనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. 26న నాగలూటి దర్గా పీఠాధిపతి హిదాయితుల్లాషాఖాద్రి, నజూరల్లా, రహమతుల్లా, అజ్మాతల్లాషాఖాద్రి స్వాముల ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు గంధం కార్యక్రమం ఉంటుందన్నారు. ఇదే రోజు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న ఉరుసు సందర్భంగా గ్రామస్తులందరు కులమతాలకు అతీతంగా దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాత్రి చెక్కభజన కార్యక్రమం ఉంటుందన్నారు. 28న కిస్తీ వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

మంత్రి ఇంట విషాదం



మృతి చెందిన త్రివేణి (ఫైల్)

ఆలూరు: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామి సతీమణి త్రివేణి (40) అనారోగ్యంతో బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఏపీకి నూతన గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు రెండు రోజుల క్రితం వెళ్లిన మంత్రి గుమ్మనూరు జయరాం విషయం తెలుసుకుని వెంటనే బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. త్రివేణి అకాల మరణం చెందడంపై పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రమణీయం.. మహా రథోత్సవం



ఎర్రకోటలో స్వామి మహా రథోత్సవం



జూటూరులో భక్తజన సందోహం మధ్య స్వామి వారి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో శుక్రవారం సాయంత్రం మహాలింగేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీలో తీసుకొచ్చి రథంపై ఆసీనులు చేయగానే రథం ముందుకు కదిలింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

జాతరను పురస్కరించుకొని నిర్వహించిన కబడ్డీ పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీలను స్నేహపూర్వకంగా తీసుకోవాలని సూచించారు. గెలుపోటములు సహజమని, ఆటల వల్ల ఆరోగ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. పోటీల్లో 30 జట్లు పాల్గొంటున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు.

వైభవంగా సంజీవరాయుడి రథోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని జూటూరు గ్రామంలో వెలసిన సంజీవరాయుడి రథోత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం రథాంగ హోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకుని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు దాతలు అన్నదానం ఏర్పాటుచేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ గోపాల్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు సరైన పోషకాహారం తీసుకొంటే రక్తహీనతను నివారించవచ్చని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, పెద్దకడుబూరు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థుల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తెలుసుకునేందుకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిమోగ్లోబిన్ శాతం పెరిగేందుకు అందుబాటులో దొరికే ఎండు ఖర్జూరం, ద్రాక్ష, వేరుశనగతో కలిపి బెల్లం, ఆకుకూరలతో కూడిన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యులు పరిమళ, సునీత, వైద్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్పర్ భద్రతో సీమకు అన్యాయం

ఎమ్మిగనూరుటౌన్: కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆర్‌పీవీఎఫ్, ఆర్‌వీపీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు నల్లారెడ్డి, ఖాజ పేర్కొన్నారు. ప్రాజెక్టును నిలిపివేయాలని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర కరపత్రాలను శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. అప్పర్‌భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో ఎల్లెల్సీ, హెచ్ఎల్‌సీ, ఆర్డీఎస్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కర్నూలు జిల్లాలో సాగు, తాగు నీటికి ఇబ్బందులు తప్పవని వివరించారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

2న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మార్చి 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దాసనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా జరగాల్సిన పనులతో పాటు అజెండాలోని అంశాల గురించి చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించిన ప్రాథమిక, ఇతర సమాచారాన్ని ఆయా శాఖాధికారులు ఈ నెల 28 నాటికి కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

సీపీఐ సమావేశం

పత్తికొండ రూరల్: స్థానిక కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపంలో సీపీఐ ఆధ్వర్యంలో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సదస్సు నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ చదువుల రామయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, సానుభూతిపరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి



ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పోతుగల్లు గ్రామస్తులు

మద్దికెర: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. శుక్రవారం మద్దికెరలోని విద్యాస్థాయి విద్యా సంస్థలకు వెళ్లి పట్టభద్రులను ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఏకంగా రెండు లక్షల ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. నిరుద్యోగులకు అండగా ఉంటామన్నారు. అలాగే ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు సామాజిక న్యాయం కల్పించడం జరిగిందన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నామన్నారు. రాబోయే కాలం యువతదే అన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ సునీత, మాజీ సర్పంచ్ శాంతన్న, మాజీ ఎంపీపీ మల్లికార్జున, పంచాయతీ సలహాదారు బందారు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆంజనేయులు, శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సోదరుడు చంద్ర ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని సచివాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కరపత్రాలు అందజేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు నాగళ్ల ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పత్తికొండటౌన్: కృష్ణగిరి మండలం పోతుగల్లుకు చెందిన టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్, మద్దిలేటి, చిన్న వెంకట్రాముడు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు మొట్టు సురేంద్ర, ఆటో మహేంద్ర, రామమద్ది, సూరి, ఆచారి తదితరులు ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మద్దికెర: బురుజుల గ్రామంలో ఈనెల 16వ తేదీన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాఘవరెడ్డి గుండెపోటుతో మరణించడంతో ఆ కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే శ్రీదేవి పరామర్శించారు. రాఘవరెడ్డి మరణం పార్టీకి తీరనిలోటన్నారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో శనివారం నుంచి జరగనున్న సద్గురు బడేసాహెబ్ తాత ఉరుసు మహోత్సవాలను అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ పి.తిమ్మారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉరుసులో దాదాపు లక్ష మంది పాల్గొనే అవకాశ ఉన్నందున సీఐ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అదనపు బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలను గ్రామం బయట కేటాయించిన స్థలంలోనే నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.